క్లుప్తంగా

డీఈవోగా పదోన్నతి


నవీన్

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయ డిప్యూటీ కార్యనిర్వహణ అధికారిగా ప్రతాప్ నవీన్‌కు మార్ పదోన్నతి పొందారు. ఏఈవోగా విధులు నిర్వహిస్తున్న నవీన్ ఇటీవలే బదిలీల్లో భాగంగా యాదగిరిగుట్టకు బదిలీపై వెళ్లారు. ఈక్రమంలో రాజన్న ఆలయంలో ఖాళీగా ఉన్న డీఈవో పోస్టుకు సీనియార్టీ ప్రకారం నవీన్‌కు పదోన్నతి కల్పిస్తూ ఈవో వినోద్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

రైతు సంక్షేమం విస్మరించిన కాంగ్రెస్


సభ్యత్వ నమోదులో కృష్ణారెడ్డి, నాయకులు

ఇల్లంతకుంట: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక చేతులెత్తేసి రైతు సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని బీజేపీ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి ఆరోపించారు. సోమవారం ఇల్లంతకుంట మండలం పొత్తూరు, రేపాక, ఇల్లంతకుంట, కందికట్కూర్, వల్లంపట్ల, రహీంఖాన్ పేట గ్రామాల్లో నిర్వహించిన బీజేపీ సభ్యత్వ నమోదులో పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు నమ్మకం పోయిందని, ప్రజలంతా బీజేపీ వైపు చూస్తున్నారని అన్నారు. కార్యక్రమాల్లో మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్, సంతోష్, స్వామి, సాయగౌడ్, అమ్ముల అశోక్, మేకల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలి


మహిళాసంఘాల సభ్యులతో సమావేశమైన అధికారులు

ఎల్లారెడ్డిపేట: బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి రుణాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఐకేపీ ఏపీఎం మల్లేశం అన్నారు. ఎల్లారెడ్డిపేట సెర్ఫ్ కావేరి మండల సమాఖ్య కార్యాలయంలో సోమవారం మండల సమాఖ్య అధ్యక్షురాలు బైరి జ్యోతి అధ్యక్షతన గ్రామ స్వయం సహాయక సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. ఇందిరా మహిళా శక్తి పథకం, సంఘాల గ్రేడింగ్, లోకోస్, మార్కెటింగ్, లక్ష్తి, దీదీ, సంఘాల లావాదేవీలపై సభ్యులకు అవగాహన కల్పించారు. మల్లేశం మాట్లాడుతూ.. రుణాలను సకాలంలో చెల్లించాలన్నారు. సీసీలు మంగ్యానాయక్, దేవేందర్, సుదర్శన్, సుధాకర్, రమణ, నాగరాజు, పద్మ, మహిళాసంఘాల సభ్యులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



బోయినపల్లి: జాతీయ బీసీ యువజన సంఘం మండల కార్యవర్గాన్ని నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు దండు వినోద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీసీ యువజన సంఘం మండల అధ్యక్షుడిగా సంబు మహేశ్, ఉపాధ్యక్షుడిగా వెంకటసాయి, ప్రధానకార్యదర్శిగా ముదాం శ్రీనివాస్, కార్యదర్శిగా పెరుక మహేశ్, సహాయకార్యదర్శులుగా నేలపల్లి రాజేందర్, పబ్బాల వినోద్, కార్యవర్గసభ్యులుగా గుంటి శేఖర్, ఎర్ర హరికృష్ణను నియమించినట్లు పేర్కొన్నారు.

ఆంధ్రాలో ఇల్లంతకుంట కళాకారుడి ప్రదర్శన



ఇల్లంతకుంట: ముస్కాన్‌పేటకు చెందిన తునికి తిరుపతి ఈనెల 19, 20వ తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో శ్రీశ్రీ కళావేదిక వారు నిర్వహించిన ప్రపంచ తెలుగు సాహితీ కళాజాతరలో ప్రదర్శన ఇచ్చారు. కవితాగానం, అల్లూరి సీతారామరాజు ఏకపాత్రాభినయం చేసి ఉత్తమ ప్రతిభకనబర్చారు. ఈసందర్భంగా తిరుపతికి శ్రీశ్రీ కళావేదిక వారు ప్రశంసాపత్రం అందజేసి సత్కరించారు.

స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలి

ఎల్లారెడ్డిపేట: నిరుపేద విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ప్రభుత్వం స్కాలర్‌షిప్, రీయింబర్స్ మెంట్‌ను వెంటనే మంజూరు చేయాలని బీఆర్ఎస్వీ మండల నాయకులు దేవరాజు, అనిల్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని గాయత్రి డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థులతో విద్యారంగ సమస్యలపై వారు మాట్లాడారు. ఖాళీగా ఉన్న లెక్చరర్ల పోస్టులను భర్తీ చేయాలన్నారు. విద్యార్థులు గంజాయి, గుడుంబా, ఇతర డ్రగ్స్‌కు అలవాటు పడవద్దన్నారు. ఇక్కడ నాయకులు మధు, జుబేర్, నాగరాజు, రాజు, తదితరులున్నారు.

ఆహ్లాదం సరే.. సౌకర్యాలేవి ?


వేములవాడలో నిర్మించిన అర్బన్ పార్క్

- రూ.2 కోట్లతో అర్బన్ పార్క్ నిర్మాణం
- మరుగుదొడ్లు, మూత్రశాలలు కరువు
- సౌకర్యాలు లేక ప్రజల ఇబ్బంది
- అసహనం వ్యక్తం చేస్తున్న సందర్శకులు

వేములవాడ రూరల్: పట్టణ ప్రజల ఆహ్లాదం కోసం ప్రారంభించిన అర్బన్ పార్క్‌లో వసతులు అరకొరగా ఉన్నాయని ప్రజలు విమర్శిస్తున్నారు. రూ.2కోట్లతో అన్ని హంగులతో నిర్మించిన ఈ పార్క్‌లో కనీసం మరుగుదొడ్లు, మూత్రశాలలు లేవన్న విషయాన్ని బహిరంగంగా పలువురు చర్చించుకుంటున్నారు. వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఇటీవల నిర్మించిన అర్బన్ పార్క్ ఎంతో ఆహ్లాదకరంగా ఉంది. ఇందులో నిర్మించి కొన్ని పరికరాలు చిన్నపిల్లలను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. కానీ పార్క్ వచ్చిన వారు అత్యవసరాలను తీర్చుకునేందుకు మూత్రశాలలు, మరుగుదొడ్లు నిర్మించకపోవడం అధికారులు అలసత్వానికి అద్దం పడుతోంది. ఇప్పటికైనా అధికారులు నీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్లు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఈ పార్క్‌కు వచ్చే పాఠకులతో పాటు ఇక్కడ అన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. కొన్ని కార్యాలయాలకు కూడా మరుగుదొడ్లు లేకపోవడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చే ప్రజలు, ఉద్యోగులు రోజూ ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సౌకర్యాలు కల్పించాలని పాఠకులు కోరుతున్నారు.

రూ.10 లక్షలతో అంచనాలు



అర్బన్ పార్క్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్మాణానికి రూ.10 లక్షల నిధులతో అంచనాలు వేశాం. నిర్మాణ పనులు చేపడుతాం. ప్రజల అవసరాలకు అనుగుణంగా త్వరలోనే అన్ని సౌకర్యాలు కల్పిస్తాం. ముందు తీసుకున్న నిర్మాణ పనుల్లో మూత్రశాలలు, మరుగుదొడ్లు లేవు.

– సంపత్‌రెడ్డి, ఇన్‌చార్జి కమిషనర్, వేములవాడ



గంభీరావుపేట: మండలకేంద్రంలోని గాంధీ చౌక్‌లో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నుంచి మురుగునీరంతా బయటకు వచ్చి రోడ్డుపై పారుతోంది. రోడ్డుపై పాదచారులు మురుగునీరు, వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ పంచాయతీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
లక్ష్మణ్, పంచాయతీ ఈవో, గంభీరావుపేట 9849597070

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర


బోయినపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం


సిరిసిల్ల అర్బన్: ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ

బోయినపల్లి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పేర్కొన్నారు. మండలంలోని తడగొండ, బోయినపల్లి, అనంతపల్లి, కొదురుపాక, జగ్గారావుపల్లి, మాన్వాడ, మల్లాపూర్, నర్సింగాపూర్, విలాసాగర్, మర్లపేటలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్లు జోగినపల్లి వెంకట్రామారావు, ముదుంటి సురేందర్‌రెడ్డి, తీపిరెడ్డి కిషన్‌రెడ్డి, దుర్గారెడ్డి, ఏఎంసీ చైర్మన్ బోయిని ఎల్లేశ్‌యాదవ్, సెస్ డైరెక్టర్ కొట్టిపెల్లి సుధాకర్, కాంగ్రెస్ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కూస రవీందర్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నెల రమణారెడ్డి, మహేశ్‌రెడ్డి, బొలుమాల శంకర్, సంబ లక్ష్మిరాజం, మార్కెట్ కార్యదర్శి రమణ తదితరులు పాల్గొన్నారు.

సిరిసిల్ల అర్బన్: పట్టణంలోని పెద్దూరులో ప్రాథమిక వ్యవసాయ సంఘం ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ చక్రపాణి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోకుండా, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రైతులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని, ఏఎంసీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ అన్నారు. గంభీరావుపేట సింగిల్‌విండో ఆధ్వర్యంలో నాగంపేట, రాజేశ్వర్‌రావునగర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె ప్రారంభించారు. సీఈవో రాజిరెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుపతి, జిల్లా నాయకుడు పిట్ల వెంకటి, సింగిల్ విండో డైరెక్టర్ రాజవీర్, మాజీ ఎంపీటీసీలు పర్శ రాములు, నాగభూషణం, నాయకులు పిట్ల బాబు, కిషన్‌గౌడ్, సతీశ్, తదితరులు పాల్గొన్నారు.

బాకూర్‌పల్లి తండాలో..

ఎల్లారెడ్డిపేట: రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని ఏఎంసీ చైర్మన్ సాబేరా బేగం, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. బాకూర్‌పల్లి తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, నాయకులు గౌస్, చిన్ని లక్ష్మి, శ్రీనివాస్, దేవేందర్, పాల్గొన్నారు.

ముస్తాబాద్: రైతులు ధాన్యాన్ని దళారులకు విక్రయించవద్దని పోతుగల్ ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణినర్సింలు అన్నారు. మండలంలోని తెర్లుమద్ది, సేవాలాల్‌తండా, కొండాపూర్, గన్నెవా రిపల్లె, గూడూరు, తుర్కపల్లిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ తన్నీరు బాపురావు, వైస్‌చైర్మన్ రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు కిషన్‌రావు, కృష్ణ, పాల్గొన్నారు.

వీర్నపల్లి ఠాణా తనిఖీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

వీర్నపల్లి: మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం ఎస్పీ అఖిల్ మహాజన్ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. కేసుల వివరాలు తెలుసుకున్నారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుల విషయంలో వెంటనే స్పందించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. నేరాల నియంత్రణకు గ్రామాల్లో విజిబుల్ పోలీసింగ్ అమలు చేయాలని, విలేజ్ పోలీస్ అధికారులు తమకు కేటాయించిన గ్రామాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. పాత నేరస్తులు, సస్పెక్ట్‌లు, రౌడీషీటర్లపై బ్లూ కోల్ట్, పెట్రోకార్ సిబ్బంది నిఘా ఉంచాలన్నారు. గంజాయి రవాణా, సేవించడం, అసాంఘిక కార్యకలాపాలపై నిరంతరం నిఘా పెట్టి కట్టడి చేయాలన్నారు. ఎస్పీ వెంట సీఐ శ్రీనివాస్, ఎస్సై ఎల్లగౌడ్, సిబ్బంది ఉన్నారు.

గంజాయి కేసులో నిందితుడి అరెస్టు

చందుర్తి : గంజాయి కేసులో కోనరావుపేట మండలం మర్తనపేటకు చెందిన నీరటి సాయికుమార్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు చందుర్తి సీఐ జి.వెంకటేశ్వర్లు తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం ...చందుర్తి సర్కిల్ పరిధిలోని కోనరావుపేట మండలం సుద్దాల శివారులోని కావేరి కాటన్ మిల్ వద్ద మూడునెలల క్రితం గంజాయితో పట్టుబడిన సుద్దాలకు చెందిన వడ్లూరి వెంకటేశ్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అప్పటినుంచి తప్పించుకొని తిరుగుతున్న నీరటి సాయికుమార్‌ను పక్కా సమాచారం మేరకు అతని ఇంట్లో పట్టుకున్నట్లు తెలిపారు. సాయి కుమార్ అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు వెంకటేశ్వర్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలి


వీర్నపల్లి : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

వీర్నపల్లి: ఎస్సీ వర్గీకరణ బిల్లును వెంటనే అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కానపురం లక్ష్మణ్ మాదిగ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం మండల కేంద్రంలో ×చలో సిరిసిల్ల× పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. ఈ23న సిరిసిలలో నిర్వహించే ఆత్మగౌరవ సభకు మాదిగ, మాదిగ ఉపకులాలవారు తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు సురేశ్, శంకర్, చంద్రయ్య, రాజం, బాబు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: పట్టణంలో చలో సిరిసిల్ల కరపత్రాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గుండా థామస్, రాష్ట్ర నాయకులు అవునూరి ప్రభాకర్, బొడ్డు రాములు, జింక శ్రీధర్, ఎల్లయ్య, తదితరులున్నారు.

గంభీరావుపేట: సిరిసిల్లలో నిర్వహించనున్న మాదిగ, మాదిగ ఉపకులాల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల నాయకులు ఇరిగి సందీప్ కోరారు. మండలకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆత్మగౌరవ సభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. నరేశ్, బీంరావు, తిరుపతి, విజయ్, స్వామి, శివ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: సిరిసిల్లలో నిర్వహించనున్న మాదిగ, మాదిగ ఉప కులాల ఆత్మగౌరవ సభకు మండలం నుంచి వందలాదిగా తరలిరావాలని ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు కానాపురం లక్ష్మణ్ అన్నారు. అంబేడ్కర్ నగర్‌లో ఆత్మగౌరవ ప్రచార పోస్టర్లను విడుదల చేశారు. నాయకులు ఎల్లయ్య, అన్నమయ్య, రాజయ్య, దేవయ్య తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: ఎస్సీ వర్గీకరణను ప్రభుత్వం వెంటనే అమలు చేసి, ప్రభుత్వ నియామకాల్లో ఎస్సీ వర్గీకరణ అమలుపర్చాలని మాదిగ మాదిగ ఉపకులాల ఐక్యవేదిక కన్వీనర్ కత్తెర దేవదాస్ డిమాండ్ చేశారు.ముస్తాబాద్‌లో చలో సిరిసిల్ల మాదిగల ఆత్మ గౌరవ కరపత్రాలను సోమవారం ఆవిష్కరించారు. నాయకులు గుండెల దేవరాములు, సుంచు మల్లయ్య, నల్లనర్సయ్య, సత్యనారాయణ, పర్శరాములు వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

ప్రసాదం అమ్మకాలపై వదంతులు సరికాదు



సిరిసిల్లటౌన్: శ్రీశాల శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహించినట్లు ఆలయ మాజీ చైర్మన్లు తీగల శేఖర్‌గౌడ్, చేపూరి నాగరాజు, ఉప్పుల విఠల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. 30 ఏళ్లుగా ఆలయంలో తాము బ్రహ్మోత్సవాల నిర్వహణలో భాగస్వామ్యం అవుతున్నామని వివరించారు. గతంలో మాదిరిగానే ఈసారి కూడా స్వామివారి ప్రసాదం లడ్డూ, పులిహోర అమ్మకాలకు వేలం నిర్వహించగా, వేములవాడ వాసి మల్లేశం దక్కించుకున్నారన్నారు. ప్రసాదాలు ఆలయ ప్రాంగణంలోనే తయారు చేయించామన్నారు. కొందరు అన్యమతస్తులతో తయారు చేయించారని ప్రచారం చేయడం సరికాదన్నారు. రథోత్సవం రోజున ప్రసాదం విక్రయించిన సందర్భంలో స్కానర్ వాడకంలో ఇతర వర్గానికి చెందిన పేరు రావడంపై తమకు ఫిర్యాదు అందడంతో వెంటనే తొలగించామన్నారు. తామంతా సనాతన ధర్మాన్ని పాటించే వాళ్లమేనని కొందరు చేస్తున్న తప్పుడు ప్రచారం భక్తులు నమ్మొద్దని కోరారు.

కళాశాల సమస్యలు పరిష్కరిస్తాం


సమస్యలు తెలుసుకుంటున్న ఆది శ్రీనివాస్

రుద్రంగి: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సమస్యలు పరిష్కరిస్తామని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. సోమవారం రుద్రంగి జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా విప్‌ను అధ్యాపకులు సన్మానించారు.

వినతిపత్రం అందజేత

రుద్రంగి సెస్ డైరెక్టర్ ఆకుల గంగారాం, ఏఈ కుమారస్వామి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను వేములవాడలోని ఆయన నివాసంలో కలిశారు. మండలకేంద్రంలో సెస్ సదన్ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని వినతిపత్రం అందజేశారు.

పోలీసు అమరులకు నివాళి


ముస్తాబాద్‌లో నివాళి అర్పిస్తున్న పోలీసులు

ముస్తాబాద్/ వీర్నపల్లి : పోలీస్ అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివని ముస్తాబాద్ ఎస్సై గణేశ్ అన్నారు. ముస్తాబాద్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్ అమర వీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం నిర్వహించారు. పోలీస్ అమరవీరుల చిత్రపటాలకు పూల మాలలువేసి నివాళి అర్పించారు. ఏఎస్సై రమణ, హెచ్‌సీలు భూమయ్య, బాల్‌నర్సయ్య, చంద్రశేఖర్, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు. వీర్నపల్లి మండలంలోని గర్జనపల్లి ఉన్నత పాఠశాలలో కొవ్వొత్తులతో ఘన నివాళి అర్పించారు. ఉపాధ్యాయులు ఉమా రాణి, బలరాం నాయక్ మంజుల, కవిత విద్యార్థులు పాల్గొన్నారు.

బోయినపల్లి మండలంలో భారీ వర్షం


గుండన్నపల్లిలో నేలవాలిన వరి

బోయినపల్లి: మండలంలోని తడగొండ, బోయినపల్లి, బూర్గుపల్లి, గుండన్నపల్లి, స్తంభంపల్లి, కోరెం తదితర గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. సుమారు గంట పాటు కురిసిన వర్షానికి గుండన్నపల్లి, బోయినపల్లి, బూర్గుపల్లి గ్రామాల్లో కోతకు వచ్చిన వరి పంట నేలవాలింది. బోయినపల్లి కల్వర్టు పరిసరాల్లోంచి వరద నీరు భారీగా పారుతోంది. గుండన్నపల్లిలో రాదా అంజయ్య, అనీల్, అజయ్‌లకు చెందిన నాలుగెరాల్లో వరిపంట నేల వాలడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు అవస్థలు పడ్డారు.

● **ప్రభుత్వ భూమిని కాపాడాలి**

సిరిసిల్లటౌన్: జిల్లా కేంద్రం శివారులోని సర్దాపూర్‌లో ప్రభుత్వ భూమి కబ్జాకు కాకుండా చూడాలని జిల్లా అధికారులను గ్రామానికి చెందిన దళిత నేత రామస్వామి కోరారు. గ్రామస్తులతో కలిసి సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసి ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. సర్వే నంబరు 27/6లో 3.38 ఎకరాల భూమిని గ్రామానికి చెందిన కొందరు కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. సమగ్ర విచారణ జరిపి ప్రభుత్వ భూమిని దళితుల ఇండ్ల స్థలాలు, అంబేద్కర్ భవనానికి కేటాయించాలని కోరారు.

● **ఆర్టీసీ సిబ్బందికి హెల్త్ క్యాంపు**

వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో సోమవారం గ్రాండ్ హెల్త్ చాలెంజ్‌ను ఆర్ఎంవో సంతోష్‌చారి ప్రారంభించారు. వేములవాడ ఏరియా ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన హెల్త్ క్యాంపులో ఆర్టీసీ సిబ్బంది కుటుంబ సభ్యులకు ఉచితంగా ఆరోగ్య పరీక్షలు చేశారు. హెల్త్ క్యాంపును మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆర్ఎంవో పేర్కొన్నారు.

● **ఆలయ పునర్నిర్మాణానికి త్వరలో టెండర్లు**

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణ టెండర్ ప్రక్రియను త్వరలో ప్రారంభించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆలయ కమిటీ ప్రతినిధులు గడ్డం జితేందర్, గంట వెంకటేశ్, గిరిధర్‌రెడ్డి, అంజాగౌడ్, చెన్ని బాబు ప్రభుత్వ విప్‌ను కలిసి పనుల గురించి వివరించారు.

● **రసాభాసగా పెట్రోల్ బంక్ పునఃప్రారంభం**

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లిలో సిరిసిల్ల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్‌బంక్ ప్రారంభం రసాభాసగా మారింది. సింగిల్‌విండో అధ్యక్షుడు బండి దేవదాస్ ఆధ్వర్యంలో పునఃప్రారంభించేందుకు సోమవారం ఏర్పాట్లు చేశారు. కాంగ్రెస్ నాయకులకు కనీస సమాచారం, ఆహ్వానం లేకుండా ప్రారంభోత్సవం ఎలా చేస్తారంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీంతో కలెక్టర్ సింగిల్‌విండో చైర్మన్‌కు ఫోన్‌చేసి ప్రారంభోత్సవం విషయంపై ఆరాతీసినట్లు తెలిసింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకుల మధ్య గొడవ జరిగే అవకాశం ఉండడంతో బద్దెనపల్లిలో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించారు. టెంట్లు తొలగించి సింగిల్‌విండో సభ్యులే కొబ్బరి కాయకొట్టి పెట్రోల్‌బంకును పునఃప్రారంభించారు.

సంక్షిప్త వార్తలు

● **పరీక్షలు షురూ**

గంభీరావుపేట: జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు సోమవారం నుంచి సంగ్రహణాత్మక మూల్యంకన (ఎస్ఏ–1) పరీక్షలు ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు జరుగనున్నాయి. గతేడాది ఆరు పరీక్షలు నిర్వహించారు. ఈ ఏడాది సైన్స్‌లో రెండు పరీక్షలు ప్రవేశపెట్టారు. నవంబర్ మొదటి వారంలో ఫలితాలు వెల్లడించి తల్లిదండ్రులతో సమావేశాలు ఏర్పాటు చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

● **ఎల్లమ్మ ఆలయంలో చోరీ**

తంగళ్లపల్లి: మండలంలోని మల్లాపూర్ శ్రీతీగల ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. కొద్ది రోజులక్రితం గుర్తు తెలియని ఓ మహిళ ఆలయంలో అమ్మవారి పుస్తె మట్టెలు అపహరించినట్లు ఆలయంలోని సీసీ కెమెరాలో రికార్డు అయింది. సదరు మహిళ ఎల్లారెడ్డిపేట మండలంలోని ఓ గ్రామామానికి చెందినదిగా గుర్తించి సోమవారం తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుచేశారు. ఈ విషయమై ఏఎస్సై చంద్రమౌళిని సాక్షి వివరణ కోరగా ఫిర్యాదు వచ్చిందని కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దుకాణంలో..

వేములవాడఅర్బన్: పట్టణంలోని మటన్ మార్కెట్ ఏరియాలో ఆగయ్య అనే వ్యక్తి నిర్వహించే చికెన్ సెంటర్‌లో ఈ నెల 19 ఓ దొంగ విలువైన వస్తువులు చోరీ చేసినట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు. సదరు దొంగ పాక్షికంగా వికలాంగుని మాదిరిగా నడుస్తున్నట్లు సీసీ ఫుటేజీలో గుర్తించామని పేర్కొన్నారు. ఆచూకీ తెలిసినవారు వేములవాడ టౌన్ సీఐ 87126 56413, ఎస్సై 87125 80413 నంబర్లకు సమాచారమివ్వాలని పేర్కొన్నారు.

● **ప్రశంసాపత్రం అందజేత**

ముస్తాబాద్: మండలంలోని బందనకల్‌కు చెందిన వేముల శ్రీనివాస్‌కు డ్యాన్స్ అంటే ఇష్టం. హైదరాబాద్‌లో డ్యాన్స్ ఇనిస్టిట్యూట్ స్థాపించి, ఎంతోమందికి శిక్షణ ఇచ్చాడు. ఇంటర్, డిగ్రీ చదువుతూనే డ్యాన్స్‌లో గుర్తింపు తెచ్చుకున్న శ్రీనివాస్‌కు ప్రముఖ కోరియోగ్రాఫర్ శేఖర్ మాస్టర్ చేతులమీదుగా సోమవారం ప్రశంసాపత్రం అందుకున్నారు.

● **బైక్ అదుపు తప్పి యువకుడికి గాయాలు**

బోయినపల్లి: బైక్ అదుపుతప్పి ఓ యువకుడికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల గ్రామానికి చెందిన సాయికృష్ణారెడ్డి తడగొండ వైపు నుంచి గంగాధర వైపు బైక్‌పై వెళ్తున్నాడు. శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు వరదకాల్వ పరిసరాల్లో బైక్ అదుపుతప్పి చెట్ల పొదల్లో పడిపోయాడు. తీవ్రగాయాలైన సాయికృష్ణారెడ్డి చికిత్స నిమిత్తం స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

● **యువకుడు అదృశ్యం**

గంభీరావుపేట: మండలకేంద్రంలోని దోసెల గూడెంకు చెందిన బరిగెల బాబు (25) అదృశ్యమైనట్లు అతని సోదరుడు సోమేశ్ సోమవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బాబు ఈనెల 19న రాత్రి 8గంటల ప్రాంతంలో ఇంట్లోంచి వెళ్లి తిరిగి రాలేదు. ఇంటి నుంచి వెళ్లినప్పుడు గోధుమ కలర్ టీషర్టు, గ్రీన్ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు.

● **రెండు వాహనాలు ఢీ.. తప్పిన ప్రమాదం**

తంగళ్లపల్లి: మండలంలోని పద్మనగర్ గ్రామ శివారు పెట్రోల్ బంక్ ప్రాంతంలో సోమవారం రెండు వాహనాలు ఢీకొన్నాయి. సిరిసిల్లవైపు వెళ్తున్న బలెనో కారు, సిద్దిపేట వైపు వెళ్తున్న బొలేరో పికప్ వాహనం ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వాహనాల్లో ఉన్నవారికి స్వల్పగాయాలుకాగా వారి వివరాలు తెలియరాలేదని స్థానికులు తెలిపారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రోడ్డుపై నిలిచిన వాహనాలను జేసీబీతో తొలగించి ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు.

● **ఉనికి కోసమే బీఆర్ఎస్ ఆరోపణలు**

ముస్తాబాద్: ప్రజలు, రైతులకు మంచి చేస్తుంటే ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు కేవలం ఉనికి కోసమే ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. పట్టణాధ్యక్షుడు రాజు, ఏఎంసీ వైస్‌చైర్మన్ రాంరెడ్డి, కుమార్, భాను, నరేశ్, ప్రశాంత్, కొండయ్య, రమేశ్, విజయ్‌రెడ్డి ఉన్నారు.

వీర్నపల్లి: ప్రజల్లో ఉనికి చాటుకునేందుకే బీఆర్ఎస్ నాయకులు ధర్నాలు చేస్తున్నారని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మండలకేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు భూత శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.